# ఉగ్రదాడిలో ముగ్గురు పాకిస్తానీలు, ఒకరు లోకల్

**పహెల్గామ్, ఏప్రిల్ 27 :**

**22 గంటలు కఠినమైన భూభాగాల గుండా పహల్గామ్‌కి..**



26 మంది టూరిస్టుల ప్రాణాలను తీసిన పహల్గామ్ ఉగ్ర దాడిలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉగ్రవాదుల ప్లానింగ్, వారికి సాయం చేసిన వారి గురించి ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు కీలక సమాచారాన్ని వెలికి తీశాయి. ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులు, ఒకరు స్థానిక ఉగ్రవాది దాడిలో పాల్గొన్నారు. ఫోరెన్సిక్ విశ్లేషణ ప్రకారం, ఉగ్రవాదులు కే-47, ఎం4 రైఫిల్స్ వాడినట్లు తెలిసింది. అత్యంత క్లిష్టతరమైన హిమాలయాలు, దట్టమైన అరణ్యాల్లో గంటల కొద్ది ప్రయాణించి పహల్గామ్ చేరినట్లు తెలుస్తోంది. కొకెర్నాగ్ అడవుల నుంచి బైసరన్ లోయకు దాదాపు 20-22 గంటల కష్టతరమైన భూభాగం గుండా నడిచి వచ్చి ప్రాణాంతక దాడిని అమలు పరిచినట్లు తెలుస్తోంది. దాడి సమయంలో ఉగ్రవాదులు రెండు మొబైల్ ఫోన్లు లాక్కున్నారు. ఒకటి స్థానికుడిది కాగా, మరొకటి పర్యాటకుడిది. స్థానిక ఉగ్రవాదిని ఆదిల్ థోకర్‌గా భద్రతా బలగాలు గుర్తించాయి. థోకర్ 2018లో హిజ్బుల్ ముజాహిదీన్‌లో చేరాడు. పాకిస్తాన్ వెళ్లి ట్రైనింగ్ పొందాడు. 2024లో కాశ్మీర్ లోయకు తిరిగి వచ్చే ముందు లష్కరే తోయిబాతో యుద్ధ శిక్షణ పొందాడు. తిరిగి వచ్చినప్పటి నుంచి థోకర్ పాకిస్తాన్ ఉగ్రవాదులకు లాజిస్టిక్ సాయం అందిస్తున్నాడు. కాశ్మీర్ భౌగోళిక స్వరూపంపై ఉగ్రవాదులకు సమాచారం ఇచ్చాడు. పహల్గామ్ దాడి సమయంలో దుకాణాల వెనుక నుంచి ఇద్దరు ఉగ్రవాదులు బాధితులను పాయింట్ బ్లాంక్ రేంజ్ నుంచి నలుగురిని కాల్చి చంపారు. దీనికి ముందు వారిని కల్మా పఠించమని ఆదేశించినట్లు తెలుస్తోంది. కాల్పులతో ఒక్కసారిగా పర్యాటకులు భద్రత కోసం అన్ని దిశల్లో పరుగులు తీశారు. అదే సమయంలో జిప్ లైన్ ప్రాంతం దగ్గర ఉన్న మరో ఇద్దర ఉగ్రవాదులు కాల్పులు జరిపి రక్తపాతాన్ని మరింత తీవ్రం చేసినట్లు తెలుస్తోంది. ఘటన సమయంలో స్థానిక ఫోటో గ్రాఫర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటనను ఆయన రికార్డ్ చేయగలిగాడు. ఇది ఇప్పుడు భద్రతా బలగాల దర్యాప్తుకు కీలకంగా మారింది. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) విచారిస్తోంది. సీన్ రికన్‌స్ట్రక్షన్ చేయడానికి ప్రత్యక్ష సాక్షుల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. లోయలోకి ఉగ్రవాదులు ఎలా ప్రవేశించారు, పారిపోయారనే విషయాలను నిశితంగా గనిస్తున్నారు.

# 48 గంటల్లో పంటలు ఖాళీ చేయాలి

- సరిహద్దు రైతులకు బీఎస్ఎఫ్ కీలక ఆదేశాలు

**పంజాబ్, ఏప్రిల్ 27:**




పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధమేఘాలు అలుముకున్నాయి. ఈ నేపథ్యంలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) సరిహద్దుల్లోని రైతులకు కీలక ఆదేశాలు ఇవ్వడం సంచలనంగా మారింది. సరిహద్దు వెంబడి ఉన్న రైతులు 48 గంటల్లో పంట కోత పూర్తి చేసి తమ పొలాలను ఖాళీ చేయాలని శనివారం బీఎస్ఎఫ్ అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. పెరిగిన భద్రతా చర్యల వల సరిహద్దు కంచె, జీరో లైన్ మధ్య ఉన్న సున్నితమైన జోన్‌లోని వ్యవసాయ భూమిని కలిగి ఉన్న రైతులు పొలాలను ఖాళీ చేయాలని అడిగారు. దీని వల్ల వేల మంది రైతులపై ప్రభావం పడుతుంది. 530 కి.మీ అంతర్జాతీయ సరిహద్దులో సుమారు 45,000 ఎకరాల సాగుపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా ఇది పంజాబ్ రైతులకు సవాల్‌గా మారింది. అమృత్‌సర్, తర్న్ తరణ్, ఫిరోజ్ పూర్, ఫాజిల్కా జిల్లాల్లోని ఈ వ్యవసాయ ప్రాంతాలకు త్వరలో ప్రవేశం మూసివేయబడుతుందని, పరిస్థితి మరిం త దిగజారితే వారి భూములకు నిరవధికంగా ప్రవేశం నిలిపేస్తామని గ్రామాల గురుద్వారాల ద్వారా హెచ్చరికల ప్రకటనలు చేశారు. ఈ పరిస్థితిపై సరిహద్దు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారుర. పశుగ్రాసం తమ పశువులకు చాలా అవసరమని, శాంతి ఉన్నంత వరకు తాము పని చేయడానికి అనుమతించాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో గోధుమ కోత ఇప్పటికే ఆలస్యమైంది. ఈ పరిస్థితుల్లో ఈ ఆదేశాలు వచ్చాయి. అయితే, రైతులు ప్రయోజనాలను మేము అర్థం చేసుకున్నామని, దీని కన్నా దేశ ప్రయోజనాలు, భద్రత ముఖ్యమని బీఎస్ఎఫ్ అధికారులు చెబుతున్నారు. పంటల వల్ల గస్తీకి ఇబ్బందులు కలగకుండా బీఎస్ఎఫ్ ఈ నిర్ణయం తీసుకుంది.






# పహల్గామ్ ఉగ్రదాడి కేసు ఎన్ఐఏకు

- హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ
- కుట్రను వెలికితీసేందుకు లోతైన దర్యాప్తు

**ఢిల్లీ, ఏప్రిల్ 27:**

ఈ నెల 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి దర్యాప్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించింది. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా దాని ఫ్రంట్ ఆర్గనైజేషన్ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ దాడి చేసినట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ దాడి మె పాక్ హస్తం ఉందనే బలమైన వాదనలు వినిపిస్తున్నాయి. పహల్గాం దాడిపై ఎన్ఐఏ దర్యాప్తు చేస్తుందని హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఎన్ఐఏ ఇప్పుడు ఈ కేసును జమ్మూ కశ్మీర్ పోలీసుల నుంచి స్వాధీనం చేసుకునే ప్రక్రియలో ఉంది. ఈ దాడి వెనుక ఉన్న విస్తృత ఉగ్రవాద నెట్‌వర్క్, కుట్రను వెలికితీసేందుకు సంస్థ లోతైన దర్యాప్తు ప్రారంభించనుంది. ఇప్పటికే ఘటనా స్థలంలో ఎన్ఐఏ బృందం ఆధారాలు సేకరిస్తోంది. ఈ బృందంలో ఉగ్రవాద వ్యతిరేక ఏజెన్సీకి చెందిన ఐజీ, డీఐజీ, ఎస్పీ ఉన్నారు. ఉగ్రదాడిని చూసిన సాక్షులను అధికారులు ప్రశ్నించనున్నారు. దాడి నుంచి బయటపడిన వారి వాంగ్మూలాలను నమోదు చేయనుంది. అలాగే.. లష్కరే, జైష్-ఎ-మొహమ్మద్, ఇతర ఉగ్రవాద సంస్థలకు చెందిన అరెస్టయిన ఉగ్రవాదులను ఈ దాడిపై ప్రశ్నిస్తుంది. పలు ఆధారాల ద్వారా ఈ దాడిలో పాకిస్థాన్ ప్రత్యక్ష ప్రమేయం ఉందని భారత్ నిర్ధారిస్తోంది. కాగా.. బైసరన్ లోయలో 26 మంది అమాయక పౌరులను చంపిన వారి కోసం ఇప్పటికే భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసుల సంయుక్త దళం వెతుకుతోంది.


# పాకిస్తాన్ ప్రధానిపై మండిపడ్డ జమ్మూ సీఎం



జమ్ము,ఏప్రిల్ 27 : పహలాంలో టూరిస్టులపై ఉగ్రదాడిపై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధంగా ఉన్నామని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. దీనిపై జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా మండిపడ్డారు. ఆ పాశవిక సంఘటనను తొలుత పాకిస్థాన్ తోసిపుచ్చి.. ఆ ఘటన వెనక భారత్ ఉందని తొలుత ఆరోపించింది అన్నారు. మనపై ఆరోపణలు చేయడంలో ముందు ఉండే వాళ్లకు ఇప్పుడేం చెప్పలేం అన్నారు. పాక్ ప్రకటనలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వాలని అనుకోవడం లేదన్నారు. ఈ దురదృష్టకరమైన ఘటన జరిగి ఉండాల్సింది కాదని సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. అయితే, పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వాలోని మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్.. తాజాగా నెలకొన్న ఉద్రిక్తతలపై స్పందించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ఘటనతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కుంటోందని వ్యాఖ్యనించారు. ఆ ఘటనపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ విచారణలో పాల్గొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. శాంతికే మా మొది ప్రాధాన్యం అని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ పాక్ పీఎం షెహబాజ్ షరీఫ్ పేర్కొనడంపై జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు.

# కెనడా వాంకోవర్ లో ఉగ్రదాడి?

- జనాలపైకి కారుతో దూసుకెళ్లిన నిందితుడు
- పదుల సంఖ్యలో మరణాలు



కెనడా: శనివారం రాత్రి కెనడాలో ఘోర సంఘటన జరిగింది. వాంకోవర్‌లో జరిగి ఓ ఫెస్ట్‌లో దుండగుడు జనాలపైకి కారును వేగంగా నడిపి, దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో అనేక మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. చాలా మంది గాయపడ్డారని స్థానిక పోలీసులు తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని 30 ఏళ్ల వాంకోవర్ వాసిగా గుర్తించారు. కారు డ్రైవర్ ఒక ఆసియా యువకుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మరణించిన వారి సంఖ్యను అధికారులు ఇంకా నిర్ధారించలేదు. దాడికి సంబంధించిన వీడియోలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రోడ్డుపై మృతదేహాలు చెల్లచెదురుగా పడి ఉన్నట్లు వీడియోలు చూపిస్తున్నాయి. ఫిలిప్పీన్స్ వారసత్వం, సంస్కృతిని జరుపుకునే లాపు లాపు డే ఉత్సవంలో ఈ దాడి జరిగింది. దీనిపై వాంకోవర్ మేయర్ కెన్ సిమ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంఘటన వెనక ఉన్న ఉద్దేశ్యాన్ని స్థానిక అధికారులు ఇంకా నిర్ధారించనప్పటికీ, ప్రాథమికంగా దీనిని ఉగ్ర దాడిగా అనుమానిస్తున్నారు. యూరప్, యూఎస్, కెనడాలో ఇలాంటి దాడులు ఇంతకుముందు జరిగాయి. ఈ ఘటనలో నిందితులు మతోన్మాదంతో దాడికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ ఏడాది న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా, 42 ఏళ్ల అమెరికన్ వ్యక్తి షంసుద్-దీన్ జబ్బర్ తన పికప్ ట్రక్కును న్యూ ఓర్లీన్స్‌లోని రద్దీగా ఉండే వీధిలో నడిపాడు. ఈ దాడిలో 14 మంది మరణించారు. 57 మంది గాయపడ్డారు. చివరకు నిందితుడిని పోలీసులు కాల్చి చంపారు. అతడి కారు నుంచి ఐసిస్ జెండాను స్వాధీనం చేసుకున్నారు. బెర్లిన్ లండన్, న్యూయార్క్ వంటి నగరాల్లో ఇలాంటి దాడులు జరిగాయి.



### బీఆర్ఎస్ రజతోత్సవ సభా వేదికపై

# మల్లారెడ్డి మాస్ డ్యాన్స్

**శెనార్తి మీడియా, వరంగల్:**

అది కాలేజ్ ఫంక్షన్ అయినా సరే, పార్టీ మీటింగ్స్ అయినా సరే మల్లా రెడ్డి పాల్గొన్నారంటే ఆ కిక్కే వేరు. కిర్రాక్ స్టెప్పులు వేస్తూ కార్తకర్తల్లో జోష్ నింపుతుంటారు. మల్లారెడ్డి మాస్ స్టెప్పులతో అతరిస్తుంటారు. తాజాగా మల్లారెడ్డి మరోసారి స్టెప్పు లేశారు. ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరిగింది. బీఆర్ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శామీర్‌పేట్ మండలం అలి యాబాద్ చౌరస్తా వద్ద నాయకులతో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సందడి చేశారు. అక్కడి నుంచి సభా వేదికకు చేరుకుని మాస్ డ్యాన్స్ కేరింతల తో కార్య కర్తల్లో జోష్ నింపారు. గా యకుల పాటలకు ఎమ్మెల్యే మల్లారెడ్డి మాస్ స్టెప్పులతో దుమ్మురేపారు. సభా వేదికపై ఉన్న నేతలం తా కూడా మల్లా రెడ్డితో కలిసి కాలుకదిపారు. దీంతో జై మల్లన్న, జై తెలంగాణ అనే నినాదాలతో మార్మోగిపోయింది. మల్లారెడ్డి మాస్ డ్యాన్స్ తో సభ ప్రాంగణం వద్ద ఉన్న జోష్ రెట్టింపయ్యింది.

# మీ భార్యా పిల్లలు భారతీయులేనా?

- కాంగ్రెస్ ఎంపీ భార్యకు పాకిస్తాన్ లింకులు
- గౌరవ్ గొగోయ్‌పై సీఎం హిమంత సంచలన పోస్ట్

**అస్సాం, ఏప్రిల్ 27:**



కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ టార్గెట్‌గా అస్సాం సీఎం హిమంత బిశ్వ సర్మ సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. 'మీరు 15 రోజులు పాకిస్తాన్‌లో బస చేశారా..? మీ భార్య పాకిస్తాన్‌కు చెందిన ఎన్జీవో నుంచి జీతం పొందుతుందా..?' అని ప్రశ్నలు సంధించారు. ఎక్స్ వేదికగా గొగోయ్‌కి ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంపీ భార్య, వారి పిల్లల పౌరసత్వ స్థితిని ఆయన ప్రశ్నించారు. సోషల్ మీడియా పోస్టులో సీఎం ఎంపీ పేరును ప్రత్యక్షంగా చెప్పకపోయినా, ఇది కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష ఉపనాయకుడు గౌరవ్ గొగోయ్‌ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలుగా తెలుస్తోంది. గతంలో చాలాసార్లు గొగోయ్‌కి ఆయన భార్యకు పాకిస్తాన్‌తో సంబంధం ఉందని ఆరోపించారు. ఎంపీ భార్య 'భారతదేశంలో నివసిస్తూ పాకిస్తాన్‌కి చెందిన ఒక ఎన్జీవో నుంచి జీతం తీసుకుంటోంది' అనేది నిజామేనా అని సీఎం హిమంత ప్రశ్నించారు. 'అలా అయితే, పాకిస్తాన్‌కి చెందిన ఒక సంస్థ భారతదేశంలో నిర్వహించే కార్యకలాపాలకు జీతం ఎందుకు చెల్లిస్తుందో మేము అడగవచ్చా..?' అని హిమంత ప్రశ్నించారు. ఎంపీ భార్య, పిల్లల పౌరసత్వం ఏమిటి అని ప్రశ్నించారు. 'వారు భారతీయ పౌరులా లేదా వారు ఇతర దేశ పౌరసత్వాన్ని కలిగి ఉన్నారా..? ఇంకా చాలా ప్రశ్నలు వస్తాయి' అని హిమంత ట్వీట్ చేశారు. గత నెలలో, గొగోయ్ బ్రిటిష్ భార్య ఎలిజబెత్ కోల్బర్న్‌కి పాకిస్తాన్తో సంబంధాలున్నట్లు హిమంత ఆరోపించారు. పాకిస్తాన్ జాతీయుడు అలీ తౌకీర్ షేక్ భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నారనే ఆరోపణలపై దర్యాప్తులో రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్‌పోల్ వంటి సంస్థల సహాయం కోరవచ్చని ముఖ్యమంత్రి చెప్పారు. అయితే, ఈ వ్యాఖ్యలపై గౌరవ్ గొగోయ్ స్పందిస్తూ..బీజేపీకి లేవనెత్తడానికి ఎలాంటి సమస్యలు లేవని, కాబట్టి నిరాధారమైన ఆరోపనలు చేస్తోందని ఆరోపించారు.

# గన్నేరువరంలో మన్ కీ బాత్ వీక్షణ



**శెనార్తి మీడియా, గన్నేరువరం:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ 121వ ఎపిసోడ్‌ను గన్నేరువరంలో బీజేపీ నాయకులు ఆదివారం వీక్షించారు. బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఏలేటి చంద్రారెడ్డి, విలాసా గరం రామ చంద్రం, అటికం రామచంద్రం, గాదె వెంకన్న, బండి తిరుపతి, నరేశ్ గౌడ్, ప్రశాంత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.